60 మందితో సిపిఎం రాష్ట్ర కమిటీ

- కొత్తగా ఏడుగురికి చోటు
- ఆహ్వానితులుగా ఏడుగురు
- ప్రత్యేక ఆహ్వానితులుగా ఐదుగురు

నూతనంగా ఎన్నికైన సభ్యులతో రాష్ట్రకార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా జాన్‌వెస్లీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ పార్టీ నూతన రాష్ట్ర కమిటీ 60 మందితో ఏర్పడింది. అందులో 15 మంది రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. సంగారెడ్డి పట్టణంలో గత నాలుగు రోజులుగా కొనసాగిన సిపిఎం రాష్ట్ర నాలుగో మహాసభ అత్యంత జయప్రదంగా ముగిశాయి. చివరి రోజైన మంగళవారం కార్యదర్శి, నూతన రాష్ట్ర కమిటీ ఎన్నికతో మహాసభల ప్రక్రియ దిగ్విజయంగా ముగిసింది.

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు..

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా 15 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అందులో జాన్‌వెస్లీ, జి.నాగయ్య, ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌రావు, చుక్క రాములు, టి.జ్యోతి, టి.సాగర్, ఎమ్‌డీ. అబ్బాస్, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి, పి.ప్రభాకర్, బండారు రవికుమార్, నున్నా నాగేశ్వర్‌రావు, ఎమ్‌డీ.జహంగీర్ ఉన్నారు. ఇప్పటిదాకా కార్యదర్శివర్గ సభ్యులుగా ఉన్న తమ్మినేని వీరభద్రం, చెరుపల్లి సీతారాములు, డిజి.నర్సింహారావు రిలీవ్ అయ్యారు. వారి స్థానంలో కొత్తగా బండారు రవికుమార్, నున్నా నాగేశ్వర్‌రావు, ఎమ్‌డీ.జహంగీర్ ఎన్నికయ్యారు.

రాష్ట్ర కమిటీ సభ్యులు వీరే

జె.వెంకటేశ్, ఎస్.రమ, భూపాల్, జయలక్ష్మి, రాంపల్లి రమేశ్, ఎ.నర్సిరెడ్డి, రవి, కె.హిమబిందు, ఎమ్‌వీ.రమణ, పి.ఆశయ్య, ఆర్.వెంకట్రాములు, బుర్రి ప్రసాద్, ఆర్.శ్రీరాంనాయక్, స్కైలాబ్‌బాబు, ఆర్.అరుణజ్యోతి, జె.బాబూరావు, పి.సచిన్, వై.శ్రీకాంత్, ఎం.భారతి, బండి రమేశ్, ఎం.సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, నారి అయిలయ్య, డబ్బీకార్ మల్లేశం, ఎం.నాగార్జునరెడ్డి, నెమ్మాది వెంకటేశ్వర్లు, కె.యాదగిరిరావు, కొండమడుగు నర్సింహ్మా, బి.అనురాధ, ఎ.కనకయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే.రమేశ్, సాదుల శ్రీనివాస్, ఎం.కనకారెడ్డి, పగడాల యాదయ్య, ఏ.మల్లారెడ్డి, బి.సాంబశివ, జి.ప్రభాకర్‌రెడ్డి, బందు సాయిలు, వి.పర్వతాలు, సీహెచ్.రంగయ్య, పి.సత్యం, ఎం.వెంకటేశ్, పుట్ట ఆంజనేయులు, జి.జయరాజు

ఆహ్వానితులు : నూర్జహాన్, ఆనందాచారి, ప్రవీణ్, అడివయ్య, లెల్లెల బాలకృష్ణ, ఉడుత రవీందర్, కళ్యాణం వెంకటేశ్వర్లు

ప్రత్యేక ఆహ్వానితులు : చెరుపల్లి సీతారాములు, నంద్యాల నర్సింహారెడ్డి, ఎస్.కృష్ణారెడ్డి, ఆర్.సుధాభాస్కర్, బుగ్గవీటి సరళ

కంట్రోల్ కమిషన్ ఇదే..

కంట్రోల్ కమిషన్‌ను ఐదుగురు సభ్యులతో వేశారు. దానికి డీజీ నర్సింహారావు చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సభ్యులుగా వంగూరు రాములు, కె.నరసమ్మ, మాటూరి బాలరాజుగౌడ్, ఎం.వాసుదేవరెడ్డి ఉండనున్నారు.

అఖిల భారత మహాసభలకు 28 మంది ప్రతినిధులు

ఏప్రిల్ మాసంలో తమిళనాడు రాష్ట్రంలోని మధురైలో జరిగే సిపిఎం అఖిల భారత మహాసభకు హాజరయ్యే 28 మంది ప్రతినిధులతో పాటు ఏడుగురు ప్రత్యామ్నాయ ప్రతినిధులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. ప్రతినిధుల బృందంలో ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, చుక్కరాములు, టి.జ్యోతి, జాన్‌వెస్లీ, టి.సాగర్, ఎమ్‌డీ.అబ్బాస్, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి, పి.ప్రభాకర్, బండారు రవికుమార్, నున్నా నాగేశ్వర్‌రావు, ఎమ్‌డీ.జహంగీర్, డీజీ.నర్సింహారావు, వై.కిరణ్‌చంద్ర, రవి, ఆర్.వెంకట్రాములు, ఎర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, ఎం.సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, మచ్చా వెంకటేశ్వర్లు, మల్లు నాగార్జునరెడ్డి, సాదుల శ్రీనివాస్, పగడాల యాదయ్య, ఎం.కనకారెడ్డి, ఎ.మల్లారెడ్డి ఉన్నారు. ప్రత్యామ్నాయ ప్రతినిధులుగా అన్నవరపు కనకయ్య, ఆనగంటి వెంకటేశ్, బి.సాంబశివ, ఎమ్‌డీ.నూర్జహాన్, ఎస్.రమ, కొండమడుగు నర్సింహ్మా, రాంపల్లి రమేశ్ ఉన్నారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్యదర్శి, కార్యదర్శివర్గ సభ్యులను, రాష్ట్ర కమిటీ సభ్యులను పొలిట్‌బ్యూరో సభ్యులు ఎ.విజయరాఘవన్, బివి రాఘవులు, ఇప్పటివరకూ కార్యదర్శిగా పనిచేసి రిలీవ్ అయిన తమ్మినేని వీరభద్రం, తదితర నేతలు అభినందించారు.

రాష్ట్ర కార్యదర్శిగా రిలీవ్ అయిన తమ్మినేని వీరభద్రం

తెలంగాణ రాష్ట్రంలో మూడు పర్యాయాలు జరిగిన రాష్ట్ర మహాసభల్లో కార్యదర్శిగా ఎన్నికై సిపిఎం ఉద్యమాన్ని బలోపేతం చేసిన రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సంగారెడ్డిలో జరిగిన మహాసభల్లో రిలీవ్ అయ్యారు. వయసు ఆరోగ్య రీత్యా రాష్ట్ర కమిటీ బాధ్యత నుంచి ఆయన రిలీవ్ అయ్యారు. అదేవిధంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులుగా పనిచేసిన చెరుపల్లి సీతారాములు కూడా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా రిలీవయ్యారు. సుదీర్ఘకాలం రాష్ట్ర కార్యదర్శివర్గంలో పనిచేసిన డిజి నర్సింగరావు సైతం సంగారెడ్డి మహాసభలో రిలీవ్ అయ్యారు.

కమ్యూనిస్టులకు విశ్రాంతి లేదు : తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కమ్యూనిస్టులకు రిలీవ్ అనేది ఉండదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బాధ్యతల నుంచి రిలీవ్ అయిన తమ్మినేని వీరభద్రం వ్యాఖ్యానించారు. మూడుసార్లు కార్యదర్శిగా పనిచేసిన తాను నిబంధనల ప్రకారం ఆ బాధ్యతల నుంచి మాత్రమే రిలీవ్ అయ్యాయని తెలిపారు. తెలంగాణలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకుపోవడం, బలోపేతం చేయడమే తమ లక్ష్యమని నొక్కి చెప్పారు. సిపిఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా ప్రతినిధుల సభలో ఆయన కార్యదర్శి హెూదాలో ముగింపు ఉపన్యాసం చేశారు. తెలంగాణలో రాబోయే రోజుల్లో కమ్యూనిస్టు పార్టీ సత్తా చూపిస్తామన్నారు. అయితే, అందుకోసం కార్యకర్తలందరూ కంకణబద్ధులై పనిచేయాలని కోరారు. మతోన్మాదం, ఆర్థిక విధానాలు, కులవివక్ష, సామాజిక అణిచివేతపై ఎప్పటికప్పుడు పోరాటాలు నిర్వహించడం ద్వారా పార్టీని ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

దేశాన్ని కాపాడేది ఎర్రజెండానే : జాన్‌వెస్లీ

మతోన్మాదం నుంచి దేశాన్ని కాపాడేది ఎర్రజెండా మాత్రమేనని సిపిఎం రాష్ట్ర నూతన కార్యదర్శి జాన్‌వెస్లీ నొక్కి చెప్పారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన అనంతరం ఆయన ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. ఉమ్మడి రాష్ట్రంలో పార్టీకి సారథ్యం వహించిన బీవీ.రాఘవులు, తెలంగాణలో ఇప్పటివరకూ కార్యదర్శిగా సేవలందించిన తమ్మినేని వీరభద్రంతో పోలిస్తే తాను వారి దరిదాపుల్లో కూడా ఉండబోనని చెప్పారు. అయితే, వారు నడిచిన బాటలో నడవడం ద్వారా పార్టీకి రాష్ట్రంలో పూర్వవైభవం తీసుకొచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తానని ప్రతినబూనారు. వర్గసమస్యలు, సామాజిక పోరాటాలకు రూపకల్పన చేయడం ద్వారా మతోన్మాదానికి అడ్డుకట్ట వేస్తామని హెచ్చరించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అబ్కారీ శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీని నాంపల్లిలోని అబ్కారీ భవన్‌లో మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బదిలీలు, పదోన్నతులపై త్వరలోనే ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహించి, అన్ని అంశాలపై చర్చిస్తానని భరోసానిచ్చారు. స్టాండర్డ్ ఆపరేషన్ ప్రోసీజర్‌ను తయారు చేసుకోవడం ద్వారా విధుల నిర్వహణలో సమర్థతను పెంచుకుని అనుకున్న లక్ష్యాలను సాధించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఉద్యోగి తన బాధ్యతలను నిబద్ధతతో, ప్రణాళికబద్ధంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సయ్యద్ అలీముర్తజా రిజ్వీ, కమిషనర్ చేవ్వూరు హరికిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి.కమలాసన్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్ అజయ్‌రావు, జాయింట్ కమిషనర్లు ఖురేషి, కెఎబి శాస్త్రీ, సురేశ్, బెవరేజెస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్లు అబ్రహం, కాశీనాథ్, అధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో రెండు కొత్త ఐటి పార్కులు

- పరిశ్రమలకు భూకేటాయింపులపై ప్రత్యేక పాలసీ
- రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగర శివార్లలో కొత్తగా రెండు ఐటీ పార్కులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లో రూ.100 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన "డ్యూ' సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులతో మంగళవారం సచివాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'ఐటీ రంగంలో హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్నది. ప్రముఖ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. అందుకే హైటెక్ సిటీ తరహాలోనే కొత్తగా మరో రెండు ఐటీ పార్కులను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. వీటిని ఎంత విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలి. ఏయే ప్రాంతాలు ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నాయో సంబంధిత యంత్రాంగం అధ్యయనం చేస్తుంది' అని మంత్రి తెలిపారు. 'పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పరిశ్రమలకు భూకేటాయింపులపై ఇప్పటి వరకు ప్రత్యేక పాలసీ అంటూ లేదు. దీని వల్ల పారిశ్రామికవేత్తలు ఇబ్బంది పడుతున్నారు. అందుకే ప్రత్యేక పాలసీని రూపొందించాలని నిర్ణయించాం. పెట్టుబడి, కల్పించే ఉద్యోగాల సంఖ్య ఆధారంగా భూమిని కేటాయిస్తాం' అని శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లో రూ.100 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన డ్యూ సాఫ్ట్‌వేర్ కంపెనీకి ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా సహకరిస్తామని వెల్లడించారు.

రీసైక్లింగ్ ఛాంపియన్‌షిప్ విజేతలకు అవార్డులు

- సత్కరించిన ఐటిసి వావ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పర్యావరణ అనుకూల పద్ధతిలో వ్యర్థాల నిర్వహణ మరియు రీసైక్లింగ్ పద్ధతుల ద్వారా పర్యావరణ నిర్వహణ, వనరుల పరిరక్షణకు తమ నిబద్ధతను బలోపేతం చేస్తూ, ఐటిసి లిమిటెడ్ మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో వెల్బీయింగ్ అవుట్ ఆఫ్ వేస్ట్ (వావ్) ఇంటర్‌స్కూల్ రీసైక్లింగ్ ఛాంపియన్‌షిప్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఛాంపియన్‌షిప్ సమయంలో సమర్థవంతమైన రీతిలో వ్యర్థాల నిర్వహణ ద్వారా క్లీన్ ఇండియా మిషన్ లేదా స్వచ్ఛ భారత్ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో విద్యార్థులు, పాఠశాలలు చేసిన అసాధారణ సహకారాన్ని గుర్తించి, వేడుక జరుపుకోవడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ టి కె. శ్రీదేవి, ప్రభుత్వ పాఠశాల విద్య కమిషనర్ ఇవి నరసింహారెడ్డి, ఐటిసి లిమిటెడ్ పేపర్‌బోర్డ్స్ అండ్ స్పెషాలిటీ పేపర్స్ డివిజన్ డివిజనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాజేష్ పొన్నూరు హాజరయ్యారు.

పెట్టుబడులన్నీ పారదర్శకమే

- ఆయా సంస్థల నుంచే వివరాలు తెప్పించుకోవచ్చు
- వరల్డ్ ఎకనామిక్ ఫోరం ద్వారా రూ.1.80 లక్షల కోట్లు సాధించాం
- ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- సిఎం రేవంత్‌రెడ్డి, ఐటి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం ద్వారా వచ్చిన పెట్టుబడులు అన్నీ పారదర్శకమే అని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ఒప్పందాలకు సంబంధించిన సమస్త సమాచారాన్ని పబ్లిక్ డొమైన్‌లో పెడతామని, ఎవరికైనా ఏవైనా సందేహాలు ఉంటే ఆయా సంస్థల నుంచే వివరాలు తెప్పించుకోవచ్చని తేల్చిచెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంపై విశ్వాసం ఉంచి పెట్టుబడులు పెట్టిన సంస్థలన్నింటికీ ధన్యవాదాలు తెలిపారు. పెట్టుబడులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల సృష్టే తమ తొలి ప్రాధాన్యత అని చెప్పారు. మంగళవారంనాడిక్కడి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రులు దనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు తదితరులతో కలిసి వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దెబ్బతీయాలని కొందరు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని, దాన్ని ప్రపంచ పారిశ్రామికవేత్తలు పటాపంచలు చేశారని అన్నారు. ఈ పెట్టుబడులు ఆషామాషీగా రాలేదని, ప్రధానిగా పివి నర్సింహారావు తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలు, మన్మోహన్‌సింగ్ హయాంలో వాటి కొనసాగింపులో భాగంగానే వచ్చాయని విశ్లేషించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం నిరంతర ప్రక్రియ అని, రాజకీయంగా ఎన్ని విభేదాలు ఉన్నా, రాష్ట్రాభివృద్ధిలో అందరూ కలిసిరావాలని కోరారు. వచ్చిన పెట్టుబడులకు సంబంధించి భూకేటాయింపులు, అనుమతుల మంజూరు ప్రక్రియను వేగవంతంగా చేస్తామన్నారు. నైపుణ్య శిక్షణ కోసం సింగపూర్‌లోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ (ఐటిఇఎస్) సంస్థతో ఇక్కడి యంగ్ ఇండియా యూనివర్సిటీ ఒప్పందం చేసుకుందని తెలిపారు. ఆ దేశంలో పదవ తరగతి పూర్తికాగానే విద్యార్థులకు సాంకేతిక శిక్షణ ఇస్తారనీ, దాన్నే ఇక్కడ కూడా అమల్లోకి తెస్తామన్నారు. దానితో పాటు ఆదేశ విద్యార్థులు ఇక్కడి యంగ్ ఇండియా యూనివర్సిటీలో విద్యను అభ్యసించేలా, ఇక్కడి విద్యార్థులు సింగపూర్‌లోని ఐటీఈఎస్‌లో శిక్షణ తీసుకొనేలా ఒప్పందం చేసుకున్నామని వివరించారు. గత ఏడాది దావోస్ నుంచి రూ.40 వేల కోట్ల పెట్టుబడులు 28 కంపెనీలతో చేసుకున్నామని, దానిలో 15 కంపెనీలు యాక్టివ్‌లో ఉండగా, మరో పది ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయనీ, మరికొన్ని ఎర్లీ స్టేజ్‌లో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడుల్ని జీర్ణించుకోలేని కొందరు వ్యక్తుల మాటల్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో వచ్చిన పెట్టుబడులు, తమ ప్రభుత్వ హయాంలో వచ్చిన పెట్టుబడులపై 2028లో కాంపారిటెబ్ టేబుల్ (పోలుస్తూ) తెస్తామన్నారు. అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో తమ కార్యాలయాలను ఏర్పాటు చేసినా, వాటిని విస్తరిస్తామంటూ ఒప్పందాలు చేసుకుంటే తప్పు ఏంటని ప్రశ్నించారు. ఈ ఏడాది దావోస్, సింగపూర్ పర్యటనలో 49,550 ఒప్పందాల ద్వారా రూ.1,82,950 కోట్ల పెట్టుబడులు వచ్చాయనీ, దీనివల్ల రాష్ట్రంలోని నిరుద్యోగులకు 51,400 ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వివరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగానే తమ ప్రభుత్వ విధాన నిర్ణయాలు ఉంటాయని స్పష్టంచేశారు. దానిలో భాగంగానే క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ తెచ్చామన్నారు. ప్రపంచ దేశాలు చైనాకు వ్యతిరేక ఆర్థిక వ్యవస్థల కోసం అన్వేషిస్తున్నాయని, వారికి ప్రత్యామ్నాయంగా భారతదేశం కనిపిస్తున్నదని, అందులో తెలంగాణకు తొలి ప్రాధాన్యత ఉందని విశ్లేషించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టి, విదేశాల్లో పెట్టుబడులు పెట్టారనీ, కానీ తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చామని చెప్పారు. బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫార్ములా ఈరేస్‌పై సిఎంకు వ్యతిరేకంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడాన్ని విలేకరులు ప్రస్తావించగా, ఆయన బానిస సంకెళ్లు తెంచుకోవాలని తాను కోరుకుంటున్నానని, ఏడాది క్రితం అయన ఏం మాట్లాడాడో అందరికి తెలుసని సిఎం రేవంత్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు.

మీర్‌పేట హత్య కేసులో నిందితుని అరెస్ట్

- ఇంట్లో గొడవల కారణంగా భార్యను హత్య చేసిన భర్త
- నిందితుడిలో కనపడని పశ్చాత్తాపం : రాచకొండ సిపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మీర్‌పేట హత్యకేసులో నిందితుడు గురుమూర్తిని పోలీసులు మంగళవారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఒక మనిషిని ఇంత క్రూరంగా చంపుతారా.. మేమే నివ్వెరపోయామని సిపి అన్నారు. భార్యను ఇంత దారణంగా చంపిన గురుమూర్తిలో ఎలాంటి పశ్చాత్తాపమూ కనిపించలేదన్నారు. మీర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసును ఛేదించిన తీరును రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు మంగళవారం ఎల్‌బీ నగర్ సీపీ క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

బాలాపూర్ మండలంలోని జిల్లెలగూడలో పుట్ట వెంకటమాధవి, గురుమూర్తి దంపతులు నివాసమున్నారు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. మాధవి స్వస్థలం ప్రకాశం జిల్లా, రాచర్ల మండలం, జెల్లీవారి పుల్లెల చెరువు గ్రామం. గురుమూర్తి ఆర్మీలో 15 సంవత్సరాలు జవాన్‌గా పనిచేసి రిటైర్ అయ్యాడు. ప్రస్తుతం ప్రయివేటు సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 15న సంక్రాంతికి బాలాపూర్ మండల పరిధిలో ఉండే మాధవి బంధువుల ఇంటికి పిల్లలను తీసుకు వెళ్లారు. పిల్లలను అక్కడే వదిలేసిన భార్యాభర్తలు ఇంటికి వచ్చారు. 16న ఉదయం భార్యతో గురుమూర్తి అకారణంగా గొడవకు దిగాడు. ఈ క్రమంలో మాధవి తలను గోడకేసి బాదడంతో ఆమె కింద పడిపోయింది. ఆ తర్వాత గొంతు నులిమి చంపేశాడు. అనంతరం ఇంట్లో ఉన్న కత్తితో మృతదేహాన్ని ముక్కలు చేసి వాటర్ హీటర్‌తో నీల్లు మరిగించి శరీర భాగాలను అందులో ఉడకబెట్టాడు. ఆ తర్వాత గ్యాస్ పొయ్యిపై పెట్టి కాల్చాడు. మరలా రోకలితో పొడి చేశాడు. ఈ ప్రక్రియ అంతా ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పూర్తి చేశాడు. పోలీసులకు ఎలాంటి ఆధారాలూ లభించకుండా ఆ పొడిని బకెట్‌లో వేసుకుని తీసుకెళ్లి జిల్లేగూడ పెద్ద చెరువులో పడేశాడు.

సీసీ కెమెరాల ద్వారా చిక్కాడు

పండుగ కావడం వల్ల హత్య సమయంలో ఆ ఇంట్లో ఎవరూ లేరు. దాంతో నిందితుడు చేసిందంతా ఎవరికీ తెలియలేదని సిపి చెప్పారు. భార్యను హత్య చేశాక ఇల్లంతా శుభ్రం చేసి, పిల్లలను ఇంటికి తీసుకుకొచ్చాడని తెలిపారు. అమ్మ ఎక్కడ అని అడగ్గా.. బయటకు వెళ్లిందని పిల్లలకు గురుమూర్తి చెప్పాడు. రెండ్రోజుల తర్వాత మృతురాలి తల్లిదండ్రులు వచ్చి అడిగితే మిస్సింగ్ అయిందని మీర్‌పేటలో అత్తతో వెళ్లి ఫిర్యాదు చేశాడు. అయితే, విచారణలో భాగంగా సిసి కెమెరాలను పరిశీలిస్తే కొన్ని అనుమానాలు వచ్చాయని, దాంతో సీన్ రీ కన్‌స్ట్రక్షన్‌లో అతన్ని అదుపులోకి తీసుకుని విచారించామని వివరించారు. సాంకేతిక పరిజ్ఞానంతో కొన్ని ప్రాథమిక ఆధారాలను సేకరించి, గురుమూర్తిని మంగళవారం అరెస్టు చేసినట్టు సిపి తెలిపారు.

సర్కారు బడుల్లో 'ప్రీప్రైమరీ' తరగతులు!

- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు చేసే అవకాశం
- ప్రభుత్వం సూత్రప్రాయ నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలని ప్రభుత్వం సమాలోచన చేస్తున్నది. వచ్చే విద్యాసంవత్సరం (2025-26) నుంచి అమలు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో ప్రస్తుతం విద్యాహక్కు చట్టం (ఆర్‌టిఇ-2009) ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో ఐదేండ్లు నిండిన విద్యార్థులనే ఒకటి తరగతిలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఆరు నుంచి 14 ఏళ్ల వరకు ఉచిత నిర్బంధ విద్యను అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు మాత్రం ఐదేళ్లు నిండితేనే ప్రవేశాలు కల్పించాలన్న నిబంధనను పాటించడం లేదు. ప్రీప్రైమరీ తరగతులను యథేచ్ఛగా నిర్వహిస్తున్నాయి. మూడేళ్ల వయస్సు నుంచే పిల్లలను నర్సరీలో చేర్చుకుంటున్నాయి. దీంతో ఆ పిల్లలు నర్సరీ, ఎల్‌కేజీ (పీపీ-1), యూకేజీ (పీపీ-2) అయ్యాక ఒకటో తరగతిలోనూ అక్కడే చదువును కొనసాగిస్తున్నారు. నర్సరీ, పీపీ-1 లేదా పీపీ-2లో చేరిన విద్యార్థులు పదో తరగతి వరకు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్నారు. ఫలితంగా వాటిలో విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణకు అవకాశం లేదు. దీంతో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతున్నది. ఇంకోవైపు పిల్లలకు మూడేండ్లు రాగానే బడికి పంపించకుండా తల్లిదండ్రులు ఉండడం లేదు. ఈ అవకాశం ప్రయివేటు పాఠశాలల్లోనే ఉంటున్నది. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రీప్రైమరీ తరగతులను ప్రవేశపెట్టాలని పలు ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను నిర్వహించాలని భావిస్తున్నది. రాష్ట్రంలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో 26,101 ప్రభుత్వ పాఠశాలల్లో 16,84,493 మంది విద్యార్థులు చదువుతున్నారు. 11,454 ప్రయివేటు పాఠశాలల్లో 36 లక్షల మంది చదువుతున్నారు. రాష్ట్రంలో గత విద్యాసంవత్సరం (2023-24)లో ప్రభుత్వ పాఠశాలల్లో 18.13 లక్షల మంది పిల్లలు చదివారు. ఈ ఏడాది 16.84 లక్షలకు తగ్గిపోయారు. అంటే 1.29 లక్షల మంది విద్యార్థులు తగ్గారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 6.06 లక్షల మంది ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందారు. వారిలో ప్రభుత్వ బడుల్లో 1,97,842 మంది, ఎయిడెడ్ పాఠశాలల్లో 6,594 మంది ఉన్నారు. ప్రయివేటు పాఠశాలల్లో 4,01,564 మంది చదువుతున్నారు. అందుకే ప్రభుత్వ బడుల్లోనూ విద్యార్థుల నమోదును పెంచే దిశగా సమాలోచన చేస్తున్నది. అందులో భాగంగానే ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలని భావిస్తున్నది.

మహారాజశ్రీ విశాఖపట్నం 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.P.No. 46 / 2023
మధ్య: చిలకా వెంకట దాశరథి ప్రవీణ్ . . . పిటీషనరు
మరియు: వడ్డిబోయిన వరుణ్‌కుమార్ మరియు ఇతరులు . . . రెస్పాండెంట్స్
నోటీసు
రెస్పాండెంట్ నెం.7
రావుల వేణుమాదవ్, డో.నెం.12-5-5/1 విజయపురి కోలనీ, తార్నక, సెక్టార్ నెం.7, సికింద్రాబాద్ తెలంగాణ-500017.
పై నెంబరు గల ఇన్‌సాల్వెన్సీ (దివాలా) పిటీషన్‌లో చిలకా దాశరథి ప్రవీణ్ మీపై I.P. No. 46/2023 పిటీషన్ వేసియున్నారు. కాగా పై నెంబరు గల ఇన్‌సాల్వెన్సీ పిటీషన్‌లో శ్రీకోర్టు వారు మీ హాజరు కొరకు తేది: 13-2-2025కి వాయిదా వేసియున్నారు. కావున పై దినమున మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని ఉదయం గం. 10-30 ని॥లకు పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలను తెలుపవలెను. లేనియెడల పై ఇన్‌సాల్వెన్సీ పిటీషన్ మీ పరోక్షమున తీర్మాణించబడునని తెలియ జేయడమైనది.
(By Order of the Hon'ble Court)
B.YASODHARA VEDAMANI
K.V.RAMANA, Advcoates,
Gajuwaka, Visakhapatnam.
Cell : 92466 21519, 92488 09471

మహారాజశ్రీ విశాఖపట్నం 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.P.No. 46 / 2023
మధ్య: చిలకా వెంకట దాశరథి ప్రవీణ్ . . . పిటీషనరు
మరియు: వడ్డిబోయిన వరుణ్‌కుమార్ మరియు ఇతరులు . . . రెస్పాండెంట్స్
నోటీసు
రెస్పాండెంట్ నెం.3
సల్ల నవీన్, డో.నెం. 5-1-222, చర్చిలేన్, శివలింగపురం, మణుగూరు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తెలంగాణ - 507117.
పై నెంబరు గల ఇన్‌సాల్వెన్సీ (దివాలా) పిటీషన్‌లో చిలకా దాశరథి ప్రవీణ్ మీపై I.P. No. 46/2023 పిటీషన్ వేసియున్నారు. కాగా పై నెంబరు గల ఇన్‌సాల్వెన్సీ పిటీషన్‌లో శ్రీకోర్టు వారు మీ హాజరు కొరకు తేది: 13-2-2025కి వాయిదా వేసియున్నారు. కావున పై దినమున మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని ఉదయం గం. 10-30 ని॥లకు పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలను తెలుప వలెను. లేనియెడల పై ఇన్‌సాల్వెన్సీ పిటీషన్ మీ పరోక్షమున తీర్మాణించబడునని తెలియ జేయడమైనది.
(By Order of the Hon'ble Court)
B.YASODHARA VEDAMANI
K.V.RAMANA, Advcoates,
Gajuwaka, Visakhapatnam.
Cell : 92466 21519, 92488 09471

GOVERNMENT OF ANDHRA PRADESH
APEWIDC, VISAKHAPATNAM
e-Procurement Short Tender Notice
Nit No. SE/AE-2/APEWIDC/38 to 49/2024, Date 27-01-2025
Tenders are invited for Civil Works (12 Nos) i.e. ZPHS at Gara, Seethagunta Gajapathinagaram, Nakkapalli, Anandapuram, Kotananduru, Papinenipalli, Repairs to SW Hostel at Amalapuram, Chimakuirthi, C/o. Model School Building at Mundlapmuru and (1 work) providing Central AC to Finance Bldg at Srikakulam with Estimate cost ranging from Rs. 43.64 Lakhs to Rs. 200.00 Lakhs
Further details: Contact No.9703336838
EXECUTIVE ENGINEER
APEWIDC, VISAKHAPATNAM

IN THE COURT OF THE HON'BLE PRL JUNIOR CIVIL JUDGE : KURNOOL
O.S.NO.293/ 2020
Corporation Bank, Kurnool Branch Rep by its Branch Manager. ...Plaintiff
V/S
Pudur Jayakanth Reddy and another. ...Defendants
మొదటి ప్రతివాదికి దావా సమనులు
To
Pudur Jayakanth Reddy
S/o P.Vijaya Kumar Reddy
Hindu aged 35 years
Chinna Amudalapadu Village,
Undavelli Mandal, Jogulamba Gadwal Dist.
Presently Residing at Flat No.303,
Sri Sailakhsmi Towers, Nacharam Uppal,
Hyderabad (T.S)
పై కోర్టు నందు వాది తనకు రావలసిన మొత్తము రూ॥3,70,537/- రాబట్టు కొనుటకు గాను మీపై దావా దాఖలు చేసి యున్నాడు. సదరు దావాపై మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల తేది.05-02-2025న ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు స్వయముగా కాని లేదా వకీలు ద్వారా కాని హాజరు అయి ఆక్షేపణలు తెలుపుకోవచ్చును. లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
(పై కోర్టు వారి ఆదేశానుసారము)
ఇట్లు
జి. నాగశేషయ్య,
వాదిపరం అడ్వకేటు,
కర్నూలు.

IN THE COURT OF THE 1st ADDL. JUNIOR CIVIL JUDGE : ANANTHAPURAMU
O.S.No.127/2023
Between:
1.K.Varalakshmi & 3 Others ...Plaintiffs
Vs
1.P.Kalyani & 5 Others ...Defendants
Notice to Defendant No.D1&D5
To.
D1: Palasamudram Kalyani, W/o.Bhupathi Sreekanth, Hindu, House Wife, Aged about 45 Years.
D5: Bupati Surya Prakash, S/o.B.Ramanjaneyulu, Aged about 52 Years, Hindu, Business, Both are Resident of Flat No.413, Yamuna Block, Sai Bhavani Enclave, Ganesh Nagar, Ramanthapur, Hyderabad, Telangana State.
పై నెంబరు దావాలోని మొదటి మరియు 5వ ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు 11-02-2025వ తేది నాటికి వాయిదా వేసినారు. కావున ఆరోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. అట్లు హాజరు కాని యెడల మీ కేసు మీ పరోక్షము నందు తీర్మానించబడును అని తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
J.CHITTARANJAN,
Advocate, Ananthapuramu.
Cell: 9440222366.

సిఎం అనాలోచిత చర్యలతో రాష్ట్రానికి నష్టం

- బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనాలోచిత చర్యలతో తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతోందని బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం సంకల్పించిన మొబిలిటీ వ్యాలీని కాంగ్రెస్ సర్కార్ పక్కన పెట్టిందని ఆరోపించారు. ఫలితంగా పారిశ్రామిక, వ్యాపార రంగాల్లో రాష్ట్రానికి తీవ్ర నష్ట జరిగిందని గుర్తు చేశారు. లక్షలాది కొత్త ఉద్యోగాలు సృష్టించే విజన్‌తో చేపట్టిన అనేక ప్రణాళికలను కాంగ్రెస్ సర్కార్ కాల రాస్తున్నదని విమర్శించారు.ఇ-కార్ రేస్‌ను రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా తీసుకుని దాన్ని రద్దు చేయడాన్ని ఆయన తప్పు పట్టారు. ప్రభుత్వాలు మారిన ప్రతీసారీ సంక్షేమ, అభివృద్ధి పథకాలను మార్చాలనుకోవడం మూర్ఖత్వమేనని ఆభిప్రాయపడ్డారు. రేవంత్‌రెడ్డి వ్యక్తిగత ప్రతిష్ఠకు పోకుండా పాలనపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ ఎలా ఇచ్చారు?

- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు దేవని సతీష్ మాదిగ ప్రశ్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గతంలో నక్సలైట్‌గా భుజాన తుపాకి వేసుకుని ధర్మసాగర్ దళ కమాండర్‌గా పని చేసిన ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ ఎలా ఇచ్చారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేవని సతీష్ మాదిగ ప్రశ్నించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బిజెపి నాయకులను, రాజకీయ నాయకులను హత్య చేసిన గద్దర్‌కు పద్మశ్రీ ఎలా ఇస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించడాన్ని ఆయన ఖండించారు. గద్దర్, మందకృష్ణ మాదిగ ఇద్దరూ నక్సలైట్ నాయకులుగా పని చేసిన వారేనని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసిన గద్దర్‌కు పద్మశ్రీ ఇవ్వకపోవడానికి నక్సలైట్ భావజాలమే కారణమని ఎలా చెబుతారని ప్రశ్నించారు. మాల, మాదిగల మధ్య వైశమ్యాలు పెంచే విధంగా చేస్తున్నారని విమర్శించారు. గద్దర్, మందకృష్ణ మాదిగ ఇద్దరూ గతంలో నక్సలైట్లేననీ, వారిద్దరూ జన జీవన స్రవంతిలో కలిసి ఉద్యమాలు చేస్తున్నారని తెలిపారు. మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ ప్రకటించడం వెనుక రాజకీయ లబ్ధి పొందాలని బిజెపి చూస్తున్నదని విమర్శించారు.

'యుపిఎస్' ఉద్యోగి భవిష్యత్తుకు ఉరి

- మార్చి 2న చలో హైదరాబాద్
- టిఎస్‌సిపిఎస్‌ఇయు అధ్యక్షులు స్థితప్రజ్ఞ

ప్రజాశక్తి - హైదరాబాద్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏప్రిల్ ఒకటి నుంచి అమలు చేయబోతున్న ఏకీకృత పెన్షన్ పథకం (యుపిఎస్) ఉద్యోగుల భవిష్యత్తుకు ఉరిలాంటిదని టిఎస్‌సిపిఎస్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు గంగాపురం స్థితప్రజ్ఞ విమర్శించారు. ఈనెల 24న కేంద్ర ఆర్థిక శాఖ తెచ్చిన యూపీఎస్ నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. అందులో భాగంగా హైదరాబాద్‌లోని అబిడ్స్ బీమా భవన్‌లోని సీపీఎస్ రాష్ట్ర నోడల్ కార్యాలయం ముందు యూపీఎస్ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానంలో ఉద్యోగి తన జిపిఎఫ్‌లో దాచుకున్న సొమ్మును ఉద్యోగ విరమణ చెందిన తర్వాత తిరిగి వంద శాతాన్ని తిరిగి పొందుతారని చెప్పారు. సిపిఎస్ విధానంలో 60 శాతం తిరిగి ఇస్తారని వివరించారు. కానీ కొత్తగా తీసుకురాబోతున్న యుపిఎస్‌లో మొత్తం సొమ్మును ప్రభుత్వమే తీసుకుంటుందని అన్నారు. ప్రతినెలా మూలవేతనం, డిఎలో పది శాతం చొప్పున ఉద్యోగి సర్వీసు కాలం 30 నుంచి 40 ఏండ్లు ఉద్యోగి దాచుకున్న మొత్తాన్ని ప్రభుత్వం ఎన్‌పిఎస్ ట్రస్ట్‌కు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సర్వీస్ పెన్షన్ నిర్ణయం జరగకపోవడం అత్యంత దారుణమని విమర్శించారు. సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని దేశవ్యాప్తంగా నిరసనలు చేస్తుంటే, ఈ యూపీఎస్ విధానాన్ని తీసుకురావడం అప్రజాస్వామికమని అన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసిన ఈ నోటిఫికేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం యుపిఎస్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. యుపిఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ వచ్చేనెల ఏడో తేదీన బెంగళూరు ఫ్రీడమ్ పార్క్‌లో ధర్నా చేపడుతున్నామని అన్నారు. మార్చి రెండున చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామనీ, ఇందిరాపార్క్ వద్ద ధర్నాచౌక్‌లో నిరసన కార్యక్రమం ఉంటుందని వివరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌సిపిఎస్‌ఇయు ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి నరేష్‌గౌడ్, రాష్ట్ర సహాధ్యక్షులు కోటకొండ పవన్, నటరాజ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నరేందర్‌రావు, కార్యదర్శి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రావు, శ్యాం సుందర్, అంజిరెడ్డి, శంకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పల్లి రైతుల ఆందోళన

- ధర భారీగా తగ్గించడంపై నిరసన
- మొన్న అచ్చంపేట.. నిన్న మహబూబ్‌నగర్ మార్కెట్ యార్డులో..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతుల కష్టంతో సంబంధం లేని దళారులు, వ్యాపారులు కుమ్మక్కై మార్కెట్‌కు ఎక్కువ ధాన్యం వచ్చినప్పుడు ధరలో భారీగా తగ్గిస్తున్నారని పల్లి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం అచ్చంపేట మార్కెట్‌లో ఇదే పరిస్థితి ఏర్పడగా, తాజాగా మంగళవారం మహబూబ్‌నగర్ మార్కెట్‌లోనూ ధర తగ్గింపుపై రైతులు ఆందోళనకు దిగారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డుకు భారీ మొత్తంలో వేరుశెనగ పంట వచ్చింది. ఇదే అదునుగా చేసుకొని వ్యాపారులు, మధ్య దళారులు కుమ్మక్కై ఒక్కసారిగా ధర తగ్గించారు. కార్యాలయం ముందు బోర్డులో ఉన్న ధర కన్నా రూ.1500 నుంచి 2000 వరకు తగ్గించి ధర నిర్ణయించడం అన్యాయం అంటూ రైతులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.6,100 ఉండగా 3500 నుంచి నాలుగు వేలకు మించి ఇవ్వడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వ్యవసాయ మార్కెట్‌కు ప్రతిరోజూ 30 వేల నుంచి 50 వేల క్వింటాళ్ల వేరుశనగ పంట వస్తోందని రైతులు తెలిపారు. అధికారులు, చైర్మన్ కూడా రైతులకు సపోర్ట్‌గా నిలబడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లి తూకం అయిన తర్వాత రైతులు ఆందోళనకు దిగడంతో జిల్లా ఉన్నతాధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ బి అనిత, కార్యదర్శి భాస్కర్ వ్యాపారులతో చర్చలు జరిపారు. రైతులకు పూర్తిస్థాయి మద్దతు ధర ఇచ్చేందుకు కృషి చేస్తానని చైర్మెన్ బేకరీ అనిత మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం రూ.200నుంచి 300 వరకూ పెంచారని తెలిపారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

నాగోబాకు మహాజలాభిషేకం

- గోదావరి జలాలతో మెస్రం వంశీయుల పూజలు
- దర్బార్‌కు హాజరు కానున్న రాష్ట్ర మంత్రులు

ప్రజాశక్తి- హైదరాబాద్

రాష్ట్రంలో సమ్మక్క సారలమ్మ జాతర తర్వాత రెండో అతి పెద్ద జాతరైన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్‌లోని నాగోబా జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. దీనికి ముందు మంగళవారం అర్ధరాత్రి మెస్రం వంశీయులు గంగాజలంతో జలాభిషేకం చేశారు. తర్వాత మహా జాతర ప్రారంభమవుతుంది. ఈ జాతరకు మెస్రం వంశీయులు పక్షం రోజుల ముందు నుంచే శ్రీకారం చుట్టారు. మంచిర్యాల జిల్లాలోని హస్తిన మడుగు నుంచి గంగ జలాన్ని తీసుకొచ్చారు. గంగాజలంతో నాగోబాకు జలాభిషేకం చేయడం ఆనవాయితీ. మంగళవారం రాత్రి 9గంటల నుంచి 11గంటల వరకు మెస్రం వంశం ఆచార సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలకు మెస్రం వంశీయుల ఖటోడ (పూజారులు) దేవ్‌రావ్, హన్మంతు, కోసేరావ్, పీఠాధిపతి మెస్రం వెంకట్ రావ్, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం ఆనంద్‌రావ్ ఆధ్వర్యంలో ఆలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం కోలికోమ్, పెప్రే, తూమ్, డోలు వాయిస్తూ.. కాగడాలను వెలిగిస్తూ పూజలు చేశారు. ఈ పూజలకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటిడిఎ పిఒ ఖుష్బు గుప్తా, ఎస్‌పి గౌస్ అలం, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఉట్నూర్ ఎఎస్‌పి కాజల్ సింగ్ తదితరులు హాజరయ్యారు. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి రెండు వరకు జాతర అధికారికంగా కొనసాగనుంది. 31న జాతరలో గిరిజన దర్బార్ నిర్వహించనున్నారు.

వక్ఫ్ బిల్లు ఆమోదం అప్రజాస్వామికం

- ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

వక్ఫ్ సవరణ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏకపక్షంగా ఆమోదించడం అప్రజాస్వామికమని అవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ బిల్లుపై వక్ఫ్ జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ప్రజలు పంపిన లక్షలాది అభిప్రాయాలను, ప్రతిపక్షాలు చేసిన సవరణలను నిరంకుశంగా తిరస్కరించి, ఏకపక్షంగా వక్ఫ్ చట్ట సవరణ బిల్లును ఆమోదించడమేంటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి నిరంకుశ చర్యలను మానుకోవాలని హితవు పలికారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ చట్టం 1995కు బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం 44 సవరణలు చేయాలని ప్రతిపాదించిందని తెలిపారు. ఈ సవరణలు వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కాకుండా అధికార బలం ఉన్న వారు ఆక్రమించేందుకు ఉపయోగపడేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్ ఆస్తులు చట్ట సవరణ వల్ల మరింత ఆక్రమణలకు గురయ్యే ఆస్కారముందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఆస్తి వక్ఫ్ హోదాను గుర్తించే అధికారం కలెక్టర్లకు, ఎమ్మార్వోలకు కట్టబెట్టడమంటే స్థానిక రాజకీయాల జోక్యానికి ఆస్కారం ఇవ్వడమేనని తెలిపారు. సవరణ చేయడం ద్వారా సంక్రమించే అధికారాలతో ముస్లిం మైనారిటీలను వేధించడానికి, రాజకీయ లబ్ధి పొందడానికి వాడుకోవాలని బిజెపి చూస్తోందని విమర్శించారు. వక్ఫ్ ఆస్తుల చట్ట సవరణ బిల్లు పట్ల తెలుగు దేశం, జనతాదళ్ (యునైటెడ్) పార్టీలు అవకాశవాదంతో వ్యవహరిస్తున్నాయనీ, పార్లమెంటులో ఆ బిల్లును వ్యతిరేకించి, మైనార్టీల పట్ల తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు. మైనారిటీలను వేధిస్తూ, వారి శ్మశానాలను, దర్గాలను, ఈద్గాలను, వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి బిజెపి కుట్రపూరితంగా తీసుకొస్తున్న వక్ఫ్ చట్ట సవరణ బిల్లును ప్రజలందరూ వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు విద్యార్థులు మృతి

- లారీ ఢీకొట్టడంతో బాలిక.. టిప్పర్ ఢీకొట్టడంతో బాలుడు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మంగళవారం ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. షేక్‌పేటలో బైక్‌ను లారీ ఢీకొట్టడంతో బాలిక, మేడిపల్లిలో ట్యూషన్‌కు వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తుండగా టిప్పర్ ఢీకొట్టడంతో పదో తరగతి విద్యార్థి మృతిచెందాడు. ఈ ఘటనలపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

ఉదయం గడ్డం హేమసుందర్ ఐదో తరగతి చదువుతున్న కుమార్తె(10)ను స్కూల్‌లో వదిలేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. ఫిలింనగర్ వద్ద వేగంగా దూసుకొచ్చిన లారీ ముందున్న వారి బైక్‌ను ఢీకొట్టింది. దాంతో కింద పడిన బాలికపై లారీ వెనుక టైర్లు ఎక్కడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. గాయపడిన తండ్రిని ఫిల్మ్‌నగర్ పోలీసులు ఆస్పత్రికి తరలించారు. అతడు ఓ ప్రముఖ న్యూస్ ఛానల్ డిజిటల్ హెడ్‌గా పనిచేస్తున్నారని తెలిసింది. బాలిక మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్టు తెలిసింది.

టిప్పర్ ఢీకొని..

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పీఎస్ పరిధిలో పదో తరగతి విద్యార్థి ట్యూషన్‌కు వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. టిప్పర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచవాణిసింగారం గ్రామానికి చెందిన మోతిరాం కుమారుడు తేజేష్ చౌదరి (15) ఉదయం స్థానికంగా ప్రయివేటు ట్యూషన్ కోసం వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. స్పాంజీల కాలనీ వద్ద టిప్పర్ ఢీకొనడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు దర్యాప్తులో ఉంది.

గీతంలో కంటెంట్ రైటింగ్ వర్క్‌షాప్ ప్రారంభం

- నాలుగు రోజుల పాటు కొనసాగనున్న కార్యశాల
- నైపుణ్యాలను పెంపొందించనున్న పరిశ్రమ నిపుణులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కంటెంట్ సృష్టి, వేగంగా అభివృద్ధి చెందుతున్న కమ్యూనికేషన్ రంగంతో కంటెంట్‌ను సృష్టించేలా విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలతో సన్నద్ధం చేయడమే లక్ష్యంగా గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జిఎస్ హెచ్‌ఎస్) క్యాంపస్‌లో నాలుగు రోజుల పాటు 'కంటెంట్ రైటింగ్ వర్క్‌షాప్'ను నిర్వహించారు. మీడియా స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో జిఎస్ హెచ్‌ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సన్నీ గోస్మాన్ జోస్ ఈ వర్క్‌షాప్‌ను మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధిని పెంపొందించడమే ఈ వర్క్‌షాప్ లక్ష్యమని తెలిపారు. సాంకేతికత పరిజ్ఞానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కంటెంట్ రైటింగ్ వృత్తిపై కృత్రిమ మేధస్సు ప్రభావాన్ని స్వీకరించడం ప్రాముఖ్యతను వివరించారు. ఈ వర్క్‌షాప్.. క్యాంపస్ నియామకాలకు సిద్ధం కావడం గురించి మాత్రమే కాదని, కాలానుగుణంగా విద్యార్థులు అభివృద్ధి చెందేలా రూపొందించామని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాణించాలని విద్యార్థులకు సూచించారు. కెరీర్ గైడెన్స్ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ మమతారెడ్డి మాట్లాడుతూ.. మిమ్మల్ని ప్రత్యేకంగా నిలబెట్టే ఒక ప్రత్యేక ఆలోచనా విధానాన్ని విద్యార్థులు అభివృద్ధి చేసుకోవడం చాలా ముఖ్యమని తెలిపారు. ఈ వర్క్‌షాప్ నిరంతర అభ్యాస సంస్కృతిని పెంపొందించడంలో నిర్వాహకుల దూరదృష్టికి నిదర్శనంగా అభివర్ణించారు. మొదటి సెషన్ రిసోర్స్ పర్సన్‌గా జియో మారియా పాల్గొని, కంటెంట్ రైటింగ్ ప్రాథమిక అంశాలు, కంటెంట్ రకాలు, ఎస్‌ఇఒ టెక్నిక్ వంటి కీలక అంశాలను విద్యార్థులకు పరిచయం చేశారు. రెండో సెషన్‌లో కంటెంట్ కమ్యూనికేషన్, వ్యక్తిగత బ్రాండింగ్ వంటి వాటిని వివరించారు. మూడు రోజులు కొనసాగే ఈ కార్యక్రమంలో పరిశ్రమ నిపుణులు పాల్గొని ఆయా అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ సయంతన్ మండల్, మీడియా స్టడీస్ విభాగాధిపతి ఎస్ఆర్ సంజీవ్ కుమార్, దాదాపు 40 మంది యుజి, పిజి విద్యార్థులు పాల్గొంటున్నారు.

ఎసిబికి చిక్కిన ఎస్ఐ, కానిస్టేబుల్

ప్రజాశక్తి-తిరుమలగిరి

పిడిఎస్ బియ్యం కేసు నుంచి తప్పించడానికి రూ.మూడు లక్షలు డిమాండ్ చేసి రూ.లక్ష లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు ఎస్ఐ, కానిస్టేబుల్ పట్టుబడ్డారు. ఈ ఘటన మంగళవారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల పోలీస్ స్టేషన్లో జరిగింది. వివరాల్లోకెళితే.. తిరుమలగిరి మండలం వడ్డేపల్లి గ్రామ మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌పై నమోదైన పీడీఎస్ బియ్యం కేసు నుంచి తప్పించడానికి తిరుమలగిరి ఎస్ఐ సురేష్ రూ.మూడు లక్షలు డిమాండ్ చేశారు. అంత ఇవ్వలేనని రూ.లక్షా 30వేలకు సెటిల్‌మెంట్ చేసుకున్నాడు. అందులో భాగంగా ఈనెల 25న సూర్యాపేటలోని శ్రీసాయి ఫిల్లింగ్ స్టేషన్ ఖాతాకు ఫోన్‌పే ద్వారా రూ.30వేలు, 28న కానిస్టేబుల్ నాగరాజుకు రూ.30వేలు వేయించుకున్నాడు. అరెస్టు నుంచి తప్పించడానికి మిగతా డబ్బులు ఇవ్వాలన్నారు. దాంతో బాధితుడు ఎసిబిని ఆశ్రయించాడు. ఎస్ఐ సురేష్ సమక్షంలో కానిస్టేబుల్ నాగరాజు రూ.70వేలు తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అంతకుముందు, 25న కానిస్టేబుల్ నాగరాజు కూడా ఫోన్‌పే ద్వారా మరో రూ.10వేలు లంచం తీసుకున్నాడు. మొత్తం రూ.1.40లక్షల(ఎస్ఐకి లక్ష, కానిస్టేబుల్‌కు రూ.40వేలు)ను సీజ్ చేశారు. వారిద్దరిని అరెస్టు చేసి నాంపల్లిలోని ఎసిబి కోర్టులో హాజరు పరుచనున్నామని అధికారులు తెలిపారు. తన తమ్ముడు రత్నాకర్‌పై నమోదైన కేసులో తనను కూడా కావాలని ఇరికించారని బాధితుడు చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడిలో ఎసిబి డీఎస్పీ జగదీష్ చందర్, సిఐ వెంకట్రావు, రామారావు, స్టాఫ్ శ్రీధర్, నరేష్ సంపత్‌తోపాటు మొత్తం 17 మంది పాల్గొన్నారు.

కంట్రీడిలైట్ నుంచి తేనె

ప్రజాశక్తి - హైదరాబాద్

సహజ నిత్యావసరాల ఉత్పత్తుల బ్రాండ్ కంట్రీ డిలైట్ తాజాగా 100 శాతం స్వచ్ఛమైన వ్యవసాయ తేనెను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. జర్మనీలోని న్యూక్లియర్ మాగ్నెటిక్ రెసోనెన్స్ (ఎన్ఎంఆర్) టెక్నాలజీ ద్వారా పరీక్షించినట్లు కంట్రీ డిలైట్ సిఇఒ, సహ వ్యవస్థాపకులు చక్రధర్ గాదె పేర్కొన్నారు. ఇది భారతీయ కుటుంబాలకు అందుబాటులో ఉన్న అత్యంత ప్రామాణికమైన, నమ్మదగిన వంటగది పదార్థాలలో ఒకటిగా నిలుస్తుందన్నారు. 17 నగరాల్లో లభించే ఈ 450 మిల్లీలీటర్ల తేనే ధరను ఆయా ప్రాంతాన్ని బట్టి రూ.196 రూ.233 మధ్య ఉంటుందన్నారు.

'రైతుబంధు'పై కుట్ర

- కోమటిరెడ్డికి దమ్ముంటే ఏం అభివృద్ధి చేశారో చెప్పాలి
- నల్లగొండ బిఆర్ఎస్ రైతు మహాధర్నాలో కెటిఆర్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రైతులకు సాగు నీరు, పెట్టుబడి సహాయం అందజేసి వ్యవసాయాన్ని పండుగగా మార్చిన కెసిఆర్ ఆనవాళ్లు చెరిపేందుకు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుబంధుపై కుట్ర చేస్తున్నారని బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. రెండు లక్షల రుణమాఫీ, పంటకు పెట్టుబడి సహాయంగా ఏడాదికి రూ.15000 ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందంటూ.. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రైతు మహాధర్నాలో ఆయన మాట్లాడారు. ధాన్యం దిగుబడుల్లో తెలంగాణను దేశంలో మొదటి స్థానంలో నిలబెట్టింది కేసీఆర్ అని చెప్పారు. పంట పెట్టుబడి కోసం రైతుబంధు పథకాన్ని అమలు చేసి ఏడాదికి రూ.10000 చొప్పున అందజేసిన ఘనత కెసిఆర్‌ది అన్నారు. రేవంత్‌రెడ్డి మాత్రం రైతు భరోసాపై మాట తప్పారు.. రైతులను నిలువునా మోసం చేశారు అని విమర్శించారు. కాంగ్రెస్ వస్తే రైతుబంధు ఆగిపోద్ది అన్నాం.. అన్నట్టే జరిగిందన్నారు. రేవంత్‌రెడ్డికి రైతుల యోగక్షేమాలు ముఖ్యం కాదు.. ప్రతిదీ రాజకీయం చేయడమే ఆయన లక్ష్యమన్నారు.

రుణమాఫీ 40 శాతం మందికి మాత్రమే అయిందని చెప్పారు. ప్రజా పాలన గ్రామ సభల్లో ప్రజలు, రైతులు కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారని, ఎక్కడికెళ్లినా దుమ్ము దులుపుతున్నారని అన్నారు. సంక్షేమ పథకాల కోసం పదే పదే దరఖాస్తులు అడుగుతూ.. ప్రజలపై ఆర్థిక భారం వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి ధాన్యానికి బోనస్ ఇస్తామన్నారు. అది లేదు.. తీరా సన్న ధాన్యం అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని విమర్శించారు. అన్ని రకాలుగా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ వాళ్లను నిలదీయాలని కోరారు. అది నల్లగొండ నుండే మొదలవ్వాలని, కాంగ్రెస్‌ను చీల్చి చెండాడాలని అన్నారు. కాంగ్రెస్ పాలనపై పోరాటం మొదలైందన్నారు. తెలంగాణ అంతా సర్వ నాశనం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులను ఎక్కడికక్కడా నిలదీయాలన్నారన్నారు.

నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఓవర్ యాక్షన్ చేస్తుండు.. చాలా వల్గర్‌గా మాట్లాడుతున్నారు.. బిఆర్ఎస్ చేసిన అభివృద్ధి.. కాంగ్రెస్ చేసిన దానిపై నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్లో చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. కోమటిరెడ్డికి దమ్ముంటే ఉమ్మడి నల్లగొండ జిల్లాను ఏం అభివృద్ధి చేసారో, రైతులకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ హయాంలో నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో మెడికల్ కళాశాలను నిర్మించామని, యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేశామని, థర్మల్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటు చేసిన ఘనత కెసిఆర్‌ది అని వివరించారు. ప్రజా పాలనలో స్వేచ్ఛ లేదని, రైతులను మోసం చేసిన కాంగ్రెస్ పాలనపై నల్లగొండలో ధర్నా చేస్తామంటే కాంగ్రెస్ వాళ్ల లాగులు తడిశాయని విమర్శించారు. రైతుల పక్షాన బిఆర్ఎస్ పోరాటం సరైనదని ధర్నాకు రాష్ట్ర అత్యున్నత కోర్టు అనుమతించిందని, హైకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తల కంటే ఎక్కువగా అధికారులు ఓవరాక్షన్ చేశారని, అధికారుల్లారా జాగ్రత్త.. 'మళ్లీ మేమే వస్తాం.. అన్నీ చూసుకుంటాం.. అసలుకు వడ్డీ సహా చెల్లిస్తాం' అని హెచ్చరించారు. ఈ ధర్నాలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్సీలు కోటిరెడ్డి, మధుసూదనాచారి, ఎండి మహిమూద్ అలీ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, గాదరి కిషోర్, భాస్కర్‌రావు, గొంగిడి సునీత, నోముల భగత్, ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, నల్లగొండ జెడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి పాల్గొన్నారు.

హుస్సేన్‌సాగర్‌లో అజయ్ మృతదేహం లభ్యం

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గణపతి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ హుస్సేన్‌సాగర్‌లో గల్లంతైన యవకుడు అజయ్ మృతదేహం లభ్యమైంది. భారతమాతకు మహాహారతి కార్యక్రమం నేపథ్యంలో ఆదివారం రాత్రి హుస్సేన్‌సాగర్‌లో బాణసంచా కాల్చేటప్పుడు చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో సిల్వేరు అజయ్ (21) అదృశ్యమైన విషయం తెలిసిందే. అజయ్ జాడ కోసం గజ ఈతగాళ్లు, ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది సోమవారం సాయంత్రం వరకు వెతికినా ఫలితం లేకపోయింది. తిరిగి మంగళవారం ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు ఒకదిక్కు గాలిస్తున్న సమయంలో సంజీవయ్య పార్క్ భారీ జాతీయ పతాకం వద్ద లేక్‌వ్యూ ఒడ్డుకు అజయ్ మృతదేహం కొట్టుకొచ్చింది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. అజయ్ తండ్రి జానకిరాములు నాగారంలో ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అజయ్ బీటెక్ చదువుతున్నాడు.

మహాహారతి కార్యక్రమంలో వైజాగ్ వాసి మణికంఠ క్రాకర్స్ ఈవెంట్ బాధ్యతలు చూసుకుంటున్నట్టు తెలిసింది. గతంలో హైదరాబాద్‌కు చెందిన రాఘవేందర్‌కు అతడు క్రాకర్స్ సరఫరా చేశాడు. వాటి నగదు ఇవ్వడానికి రాఘవేందర్ తన ఫ్రెండ్స్ అజయ్, సాయి సందీప్‌ను తీసుకుని ఆదివారం నెక్లెస్ రోడ్డుకు వచ్చినట్టు సమాచారం. కాగా, ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన గణపతి సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు.

దురదృష్టకరం: భారతమాత ఫౌండేషన్

మహాహారతి క్రాకర్స్ షోలో ప్రమాదం దురదృష్టకరమని భారతమాత ఫౌండేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రమాదంలో గాయపడిన వారికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెరుగైన చికిత్స అందిస్తున్నామని, బాధితులు, వారి కుటుంబాలకు అండగా ఉంటామని ఫౌండేషన్ కార్యాలయ కార్యదర్శి వికాస్ కుమార్ తెలిపారు.

ఆజంజాహీ మిల్లు కార్మిక భవన్‌ను కూల్చేసిన కాసంను అరెస్ట్ చేయాలి

- వరంగల్ చౌరస్తాలో కార్మికుల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆజంజాహీ మిల్లు కార్మిక భవన్‌ను కూల్చివేసిన కాసం ఓం నమశ్శివాయను అరెస్టు చేయాలని కోరుతూ మంగళవారం ఆజంజాహీ మిల్లు కార్మికులు వరంగల్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కాసం ఓం నమశ్శివాయ కార్మిక భవన్‌ను దౌర్జన్యంగా కూల్చి, అందులోని వస్తువులు, బీరువాలు, బెంచీలు, యూనియన్ పత్రాలు, ఆర్థిక సంబంధమైన డాక్యుమెంట్స్‌ను ఎత్తుకెళ్లారని తెలిపారు. తప్పుడు పత్రాలతో కార్మిక భవన్ ఆక్రమణకు ప్రయత్నించిన కాసం ఓంను అరెస్ట్ చేయాలని, ఆజంజాహీ మిల్లు కార్మికులకు న్యాయం జరిగే వరకూ జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపిలు కార్మికులకు అండగా ఉండాలని డిమాండ్ చేశారు. కార్మికుల ధర్నాకు ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, సిటిఒ ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలియజేశారు. ఆజంజాహీ మిల్లు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇనుముల శ్రీనివాస్, ఆరెల్లి కృష్ణ నాయకులు కాశీం, నర్ర ప్రతాప్, నున్న అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

'త్రిష'కు మంత్రి దామోదర్ అభినందనలు

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

ఉమెన్స్ అండర్-9 క్రికెట్ కప్ చరిత్రలో మొట్టమొదటి సెంచరీని నమోదు చేసిన తెలంగాణ బిడ్డ గొంగడి త్రిషను వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. ఈ మేరకు బుధవారం మంత్రి ట్వీట్ చేశారు. మరింత ఉన్నతస్థాయికి వెళ్లాలనీ, అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యుత్తమ ప్లేయర్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. త్రిష సాధించిన సెంచరీ, క్రీడల్లో రాణించాలనుకుంటున్న ఎంతోమంది ఆడబిడ్డలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్‌కు రూ.339 కోట్ల లాభాలు..

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ప్రయివేటు రంగంలోని ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లాభాలు 53 శాతం తగ్గి రూ.339 కోట్లకు పరిమితమయ్యాయి. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.716 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇదే సమయంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 14 శాతం పెరిగి రూ.4,902 కోట్లకు చేరింది. 2024 డిసెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 1.94 శాతానికి తగ్గాయి. ఇంతక్రితం ఏడాది ఇదే కాలానికి 2.04 శాతం జిఎన్‌పిఎ చోటు చేసుకుంది. ఇదే సమయంలో 0.68 శాతంగా నికర నిరర్థక ఆస్తులు.. గడిచిన క్యూ33 ముగింపు నాటికి 0.52 శాతానికి తగ్గాయి.

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్

- ముగ్గురు మైనర్లు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లాలో నూతనంగా ప్రారంభించిన ఆరాంఘర్ మన్మోహన్ సింగ్ ఫ్లై ఓవర్ పై బైక్‌పై వెళుతున్న ముగ్గురు మైనర్లు అతివేగంతో డివైడర్‌ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్కొండ ఫతే దర్వాజాకు చెందిన మాజ్ (15), అహ్మద్ (14), తలాబ్‌కట్టకు చెందిన సయ్యద్ ఇమ్రాన్ (15) ముగ్గురు కలిసి బైక్‌పై త్రిబుల్ రైడింగ్ చేస్తూ బహదూర్‌పూర్ నుంచి ఆరాంఘర్‌కు వెళు న్నారు. అయితే అతివేగంతో శివరాంపల్లి నేషనల్ పోలీస్ అకాడమీ వద్దకు రాగానే అతివేగంతో వెళ్తున్న బైక్ డివైడర్‌ను ఢీకొట్టింది. దాంతో బైక్‌పై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యి ప్రమాదస్థలంలోనే మృతిచెందారు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి అతివేగమే కారణమని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.